

యూరియా పక్కదారి..!

- కూటమి నాయకుల కనుసన్నల్లోనే వ్యవహారం
- రైతులకు తప్పని అవస్థలు
- రైతు సేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు

యూరియా కొరత లేకుండా చర్యలు చేపట్టామని అధికారులు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. రైతులకు అందాల్సిన యూరియా కూటమి నాయకుల కనుసన్నల్లో పక్కదారి పడుతోంది. దీంతో యూరియా కోసం రైతు సేవా కేంద్రాలు చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది...



ఆదోని మండలం పెద్ద హరివాణంలో ఎరువులు కోసం రైతు సేవ కేంద్రం వద్ద బారులు తీరిన రైతులు (ఫైల్)

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే ఎరువు కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రానికి ఎరువులు వస్తున్నాయని తెలియడం ఆలస్యం వ్యవసాయ పనులు మాను కొని గంటల తరబడి క్యూలైన్‌లో వేచి ఉంటున్నారు. ఎరువుల కొరత నెలకొందనే సమాచారం రైతులను కలవర పెడుతోంది. ఖరీఫ్ సాగు సీజన్ ముంచుకొచ్చినా ఆశించిన స్థాయిలో నిల్వలు చేరలేదు. దానికి తోడు వచ్చిన యూరియా కూడా కూటమి చోటా మోటా నాయకుల కనుసన్నల్లో పక్కదారి పడుతోంది. దీంతో యూరియా అందక రైతులకు అవస్థలు తప్పడం లేదు. విత్తు మొలకెత్తాక డిఎపి, కాంప్లెక్స్, సింగిల్ సూపర్ పాస్ఫేట్ వంటి ఎరువులు వినియోగిస్తారు. ఇక పైరు ఎదుగుదలలో నత్రజని (యూరియా) ఎరువులను వాడతారు. సరిపడ ఎరువులు లేవనే సమాచారంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 877 ఆర్బీకేలు ఉండగా 188 మూతపడి 689 మాత్రమే ఉన్నాయి. వీటికి యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు ఇవ్వకుండా పిఎసిఎస్‌లకు, డిసిఎంఎస్‌లకు సరఫరాల చేస్తున్నారు. ఆ సొసైటీలు 'కూటమి' పార్టీల నేతల చేతుల్లో ఉండటంతో వీటికి సరఫరా అవుతున్న యూరియా పలుకుబడి ఉన్న వారికే వెళ్లిపోతోంది. రైతులకు అందడం లేదు. ఎపి మార్క్‌ఫెడ్ వద్ద 401.4 మెట్రిక్ టన్నులు, రైతు సేవా కేంద్రాల వద్ద 398.67 మెట్రిక్ టన్నులు, రిటైలర్ల దగ్గర 384 మెట్రిక్ టన్నులు, సహకార సంఘాలు, మార్కెటింగ్ సొసైటీల వద్ద 54.535 మెట్రిక్ యూరియా నిల్వలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. మరో 2187.39 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రావాల్సి ఉందని అంటున్నారు. అయినా క్షేత్ర స్థాయిలో మాత్రం రైతులకు తిప్పలు తప్పడం లేదు. గత వారం రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఎరువుల కోసం పరుగులు తీస్తున్నారు. (గ్రోమర్ 28-28-0, ఫ్యాక్టమ్‌ఫాస్ 20-30-0-18, గోదావరి డీఏపీ, 16-28-26, 14-35-14 తదితర మిశ్రమఎరు వుల కోసం రైతు సేవా కేంద్రాలు, ప్రయివేటు ఎరువుల దుకాణాల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేస్తున్నారు. రైతు సేవా కేంద్రాలకు వచ్చిన కాంప్లెక్సు మిశ్రమ ఎరువులను అక్కడి సిబ్బంది అమ్మేసుకొంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో నూటికి 90 శాతం రైతు సేవా కేంద్రాలకు యూరియా సరఫరా అయినప్పటికీ రాజకీయ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే చేరుతోంది. వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం ఒక రైతుకు గరిష్ఠంగా 9 సంచులు ఇవ్వాలన్న నిబంధన ఉన్నప్పటికీ రాజకీయ నేతలు ఒక్కొక్కరికి 10 బస్తాలకుపైగా విక్రయిస్తున్నారు. అధికారులు రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి ఫొటోలకు ఫోజులిచ్చి హాజరు వేసుకుని వస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అధిక ధరతో దోపిడీ

ఎకరాకు ఒక్క యూరియా బస్తా మాత్రమే ఇస్తామని చెప్పి 5 ఎకరాలు సాగు చేసుకున్న రైతులకు 2, 3 బస్తాలతోనే సరి పెడుతున్నారు. దీంతో రైతులు ప్రయివేట్ డీలర్లను ఆశ్రయిస్తుండడంతో వారు ఇదే అదనుగా ధర పెంచి దోపిడీ చేస్తున్నారు. యూరియా బస్తా ధర రూ.265 ఉండగా రూ.360 నుంచి రూ.400 వరకూ అమ్ముతున్నారు. దానికి తోడు అమ్మోనియా గుళికల పేరుతో అదనగా రూ.550 అంటగడుతున్నారు. అవి తీసుకోకుంటే యూరియా ఇచ్చేది లేదని చెబుతున్నారు. దీంతో రైతు ఒక్క బస్తా యూరియాకు రూ.900పైనే వెచ్చించాల్సి వస్తోంది. వరికి సాగు పూర్తి అయ్యే సరికి పైరుకు మూడు సార్లు ఎరువులు (వర్షాలు బాగా పడితే 2 సార్లు వర్షాలు లేకుంటే మూడుసార్లు) వేయాల్సి ఉంటుంది. ఇక మొక్కజొన్నకు ఎకరాకు పైరు పెరగడానికి కనీసం 4 బస్తాల యూరియా వేస్తారు. ఈ లెక్కన రైతు ఎరువులకే రూ.25 వేల నుండి 30 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది.

గత నెల 23 నుంచి తిరుగుతున్నాం

గత నెల 23న యూరియా కోసం మాకు స్లిప్పులు రాసిచ్చారు. ఆ రోజు నుంచి ఈ రోజు వరకూ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా యూరియా ఇవ్వడం లేదు. స్టాకు లేదని చెబుతున్నారు. దీనిపై అధికారుల చర్యలు తీసుకోవాలి. యూరియాను అందుబాటులోకి తీసుకురావాలి.



- కె.తిమ్మగురుడు, కనకవీడు, నందవరం మండలం.

రైతులతో ఉద్యమాలకు సిద్ధమవుతాం

యూరియా విషయంలో రైతుల ఇబ్బందులు రాష్ట్ర ప్రభుత్వానికి పట్టడం లేదు. కూటమి ప్రభుత్వం రైతులపై చిన్న చూపు చూస్తోంది. సరైన సమయంలో రైతులకు యూరియా అందించకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధమవుతాం.



- జి.రామకృష్ణ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.

నేర నియంత్రణకు ఈ-బీట్

- సైబర్ క్రైమ్ నివారణకు అవగాహన
- మహిళల భద్రతకు శక్తి టీమ్‌లు
- ప్రజాశక్తితో ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ముఖాముఖి



ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

'జిల్లాలో ప్రజల శాంతిభద్రతలే లక్ష్యంగా పోలీసింగ్ నిర్వహిస్తున్నాం. జిల్లాలో ఇటీవల సైబర్ నేరాలు పెరిగిపోయాయి. వాటి నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. మహిళల భద్రతకు శక్తి టీమ్‌లను ఏర్పాటు చేశాం. ఈ-బీట్ ద్వారా రాత్రి వేళల్లో గస్తీ నిర్వహించి, నేరాల నియంత్రణకు కృషి చేస్తున్నాం' అని ఎస్‌పి విక్రాంత్ పాటిల్ తెలిపారు. ప్రజాశక్తితో ఎస్‌పి ముఖాముఖి మాట్లాడారు...

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు చేపడుతున్న చర్యలు ఏమిటి..?

ఎస్‌పి : జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించే దిశగా అనేక చర్యలు చేపడుతున్నాం. ప్రధానంగా మహిళల రక్షణపై దృష్టి సారిస్తున్నాం. ఈ మధ్యకాలంలో సైబర్ నేరాల బారినపడి ప్రజలు పెద్ద ఎత్తున మోసపోతున్నారు. వాటికి సంబంధించి కూడా ప్రజల్లో అవగాహన పెంపొందించే చర్యలు చేపడుతున్నాం.

మహిళల రక్షణకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి..?

ఎస్‌పి : జిల్లాలో మహిళల రక్షణ కోసం శక్తి టీమ్‌లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశాం. ఈఏడాది మార్చి 8న ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే సందర్భంగా ఈ టీమ్‌లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. జిల్లాలో జిల్లా హెడ్ క్వార్టర్ టీమ్‌తో సహ కర్నూలు, ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు సబ్ డివిజన్ల పరిధిలో మొత్తం ఐదు శక్తి టీమ్‌లను ఏర్పాటు చేశాం. ఒక్కో టీమ్‌లో ఇద్దరు మహిళలు, నలుగురు పురుషులతో కలిపి మొత్తం ఆరుగురు పోలీసులు ఉంటారు. మహిళలపై ఈవ్ టీజింగ్‌కు పాల్పడే వారిని గుర్తించి చర్యలు తీసుకోవడం కోసం ప్రత్యేక హాట్ స్పాట్‌లను గుర్తించి అక్కడ ఈ టీమ్‌లు పనిచేస్తూ ఉంటాయి. ముఖ్యంగా అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నపిల్లలకు వీడియోల ద్వారా మంచి, చెడు స్పర్శల గురించి అవగాహన కల్పిస్తున్నాం. పాఠశాలల్లో, ఇంటర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు మంచి, చెడు స్పర్శలతో పాటు ఈవ్‌టీజింగ్, బాల్య వివాహాలు, ప్రేమ మోసాలు, సోషల్ మీడియా ప్రభావం, సైబర్ క్రైమ్, విద్య ప్రాధాన్యత వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం. చిన్నపిల్లలకు, డయల్ 1098కు, మహిళలకు డయల్ 181కు, సైబర్ నేరాల నివారణ కోసం డయల్ 1930 నెంబర్లకు ఫోన్ చేసి సహాయం కోసం సంప్రదించాలి. శక్తి ఎస్ఒఎస్ యాప్‌లో కానీ, వాట్సప్ నెంబర్ 7993485111 నెంబర్‌లో కానీ సంప్రదించవచ్చు.

సైబర్ క్రైమ్ నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు..?

ఎస్‌పి : సమాజంలో సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సైబర్ నేరాలు కూడా పెరుగుతూ వస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం ప్రజల్లో వాటి పట్ల అవగాహన లేకపోవడమే. సైబర్ నేరాలను నియంత్రించడం కోసం వారిలో అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ఉంచుకుంది. జిల్లాలో ఈ ఏడాది రోజూ 30 నుంచి 40 కార్యక్రమాలు లక్ష్యంగా 3,084 అవగాహన కార్యక్రమాలను నిర్వహించాం. సామాజిక మాధ్యమాల్లో సైబర్ నేరగాళ్లు ఏదో ఒక ఆశ చూపి వారి వలలో పడేస్తున్నారు. ప్రజలు గుర్తుతెలియని లింకులను, మెసేజ్‌లకు స్పందించకపోవడం ఉత్తమం. ఒటిపిలు, పాస్ వర్డులను అపరిచితులకు పంపకూడదు. ఈఏడాది జిల్లాలో ఇప్పటి వరకు ఈ నేరాల బారిన పడి రూ.6,23,45,180 మోస పోయారు. రూ.2,23,63,000 బాధితులకు రిఫండ్ చేయగలిగాం. రూ.2.15 కోట్లు బ్యాంకుల్లో హోల్డ్ చేశాం.

రాత్రి వేళల్లో గస్తీ నిర్వహణ ఏ విధంగా కొనసాగుతోంది..?

ఎస్‌పి : ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించే విధంగా, రాత్రి వేళల్లో ఎలాంటి దొంగతనాలు, నేరాలు జరగకుండా ఉండేందుకు ఈ-బీట్ విధానాన్ని నూతనంగా ప్రవేశపెట్టాం. ఇందులో రోజూ 40 ఈ-బీట్‌లను ఏర్పాటు చేశాం. ఈ బీట్ల పనితీరును పరిశీలించేందుకు పర్యవేక్షణగా పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కానిస్టేబుల్, సిఐ పరిధిలో ఒక కానిస్టేబుల్, డీఎస్‌పి పరిధిలో ఇద్దరు ఎస్‌ఐలు ప్రత్యేకంగా ఉంటారు. ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తుంటే బీట్‌లో ఉండే పోలీసులు వారి ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ కూడా తీసుకొని నేరస్తుల సంచారాన్ని పసిగడుతున్నాం. తద్వారా నేరాలను ముందుగానే నివారించే అవకాశం ఉంటుంది.

నేరాల నియంత్రణకు సిసి కెమెరాలపై ఎలాంటి దృష్టి సారిస్తున్నారు..?

ఎస్‌పి : నేరాల నివారణలో సిసి కెమెరాల ప్రాముఖ్యత ఎంతో విలువైంది. అందులో భాగంగా జిల్లాలో ఈఏడాది 4,985 కెమెరాలను కొత్తగా అమర్చాం. ప్రధానంగా జిల్లా సరిహద్దుల్లో, రాష్ట్ర సరిహద్దుల్లో వీటిని ఏర్పాటు చేయడమే కాకుండా ప్రతి గ్రామంలోనూ ప్రధాన ప్రవేశ ద్వారాల్లో, అనుకూల ప్రదేశాలను గుర్తించి కెమెరాలను ఏర్పాటు చేశాం. ఆయా స్టేషన్ పరిధిలో వాటి నిర్వహణను చేపడుతున్నాం.

రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు..?

ఎస్‌పి : అత్యధికంగా రోడ్డు ప్రమాదాలు వాహనదారులు మద్యం సేవించడం వల్ల చోటు చేసుకుంటున్నాయి. దీనివల్ల వారిపై ఆధారపడిన కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. వీటిని నియంత్రించడానికి ప్రధానంగా డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేకంగా ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో చేపడుతున్నాం. ఓపెన్ డ్రింకింగ్ చేసేవారిని కూడా అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేస్తున్నాం.



నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని రెవెన్యూ, మున్సిపల్, మండల కేంద్రాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. **కర్నూలు కార్పొరేషన్ :** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. ఉదయం 10:30 గంటల నుండి కార్యక్రమం ప్రారంభం అవుతుందని, అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. నగర పరిధిలోని ప్రజలకు సమస్యలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

విద్యార్థులు ఎక్కడ స్థిరపడినా చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ఆదివారం ఓర్వకల్లు మండలం కాల్వ బుగ్గ ఏపి రెసిడెన్షియల్ స్కూల్‌ను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిఎం శ్రీ కింద 14 కోట్ల రూపాయలతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అందులో ఇప్పటికే 12 కోట్ల రూపాయల పనులను కూడా పూర్తి చేశామన్నారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాలన్నింటికీ మరమత్తుల కోసం 8 కోట్ల రూపాయలను మంజూరు చేయడంతో పాటు 90 శాతం పనులు కూడా పూర్తయ్యాయని చెప్పారు. అలాగే బీసీ సంక్షేమ వసతి గృహాల మరమ్మతులకు ఎంపీ లాడ్స్ కింద కోటి రూపాయలు, డిఎంఎఫ్ కింద 50 లక్షల రూపాయలను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇక్కడ ఉన్న ఆట స్థలంకి సంబంధించిన లెవెలింగ్ పనులకు రూ. 30 లక్షల నిధులను మంజూరు చేశామన్నారు. పాఠశాలలోనే 26 లక్షల రూపాయలతో సోలార్ రూఫ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బనవాసి ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో ఇంటర్నల్ రోడ్లు, మరమ్మతులు పనులు కూడా చేయిస్తున్నట్లు చెప్పారు. ఈ పాఠశాలలో విద్యను అభ్యసించిన సందర్భంగా తన సహ విద్యార్థులు, టీచర్లు, ఉపాధ్యాయులతో సమావేశమై అప్పటి జ్ఞాపకాలను, అనుభవాలను కలెక్టర్ గుర్తు చేసుకున్నారు. అనంతరం పాఠశాలలో వివిధ రంగాల్లో ప్రతిభ సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, ప్రోత్సాహక బహుమతులను కలెక్టర్ అందచేశారు. కార్యక్రమంలో డిఈఓ శామ్యూల్ పాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా



ఆర్ఎస్ఎస్ అజెండాతో మోడీ, షా రాజకీయాలు

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఆర్ఎస్ఎస్ అజెండాతో మోడీ, అమిత్ షాలు నడ్డాను పక్కనపెట్టి రాజకీయాలు నడుపుతున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. సిపిఐ కర్నూలు జిల్లా మహాసభ సందర్భంగా కర్నూలు పున్నమి రెస్టారెంట్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంతో మాట్లాడారు. కమ్యూనిస్టులుగా లౌకిక పార్టీలతో ఇండియా కూటమి ద్వారా బిజెపి, ఆర్ఎస్ఎస్‌లను ఎదుర్కోగలమని చెప్పారు. సెప్టెంబర్ 22 నుండి 25 వరకు చండీగఢ్లో జరుగు సిపిఐ జాతీయ మహాసభలు ఆ పోరాటాలకు నాంది కావాలన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న విషయాలను చర్చించి పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు పక్కన పెట్టి అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. అధికారం చేపట్టాక ఆయన చూపు కిందికి ఉండదు అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అన్న ముఖ్యమంత్రి అవసరమైతే మా మంత్రులందరూ రాజీనామా చేస్తామని ఒక లెటర్ ఇచ్చారన్నారు. పరిశ్రమల శాఖ మంత్రి దగ్గరకు వెళ్లి మిట్టల్‌కు పరిమిషన్ ఇవ్వాలని అడుగుతున్నారని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం వస్తే విద్యుత్ చార్జీల పెంచమని చెప్పిన చంద్రబాబు సంవత్సర కాలంలోనే విద్యుత్ చార్జీలు పెంచి రూ.15,480 కోట్లు ప్రజలపై భారం వేశారన్నారు. 100 కోట్లు విలువైన ఆర్టీసీ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పడానికి చూస్తున్నారని అన్నారు. పోలవరం బనకచర్ల పేరుతో కాంట్రాక్టర్లకు కట్టబెట్టాలని చూస్తున్నారన్నారు. 20 లక్షల కోట్లతో ప్రాజెక్టులు క్రిష్ణా, గోదావరి, పెన్నా నదులపై నిర్మించి వాటి పెత్తనం కాంట్రాక్టర్లకు ఇవ్వనున్నారని చెప్పారు. పి4లో భాగంగా కోటీశ్వరులను దగ్గరకు పిలుచుకొని వారిని అడుక్కొని కొన్ని కుటుంబాలను దత్తత తీసుకోవాలని అడగాలని అధికారులను ఆదేశిస్తున్నారని, పేద ప్రజలను బానిసలుగా చేస్తూ కార్పొరేట్లకు ఆస్తులు పెంచి ఆదుకుంటున్నారని ఆరోపించారు. టూరిజం ఆస్తులను కూడా ప్రైవేటు వారికి ఇస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రమాదకరమైనఆర్థిక విధానాలు అవలంబిస్తుందని చెప్పారు. వాటికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు జెండా ఎత్తి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కర్నూలు జిల్లా నుండి రైతులు వలసలు వెళుతున్నారని, పేదరికంతో పాటు, విద్య లో కూడా కర్నూలు జిల్లా వెనుకబడి ఉందని తెలిపారు. కర్నూలు జిల్లాలోని వేదవతి గుండ్రేవుల ప్రాజెక్టులకు నిధులు ఇవ్వడం లేదన్నారు. హైకోర్టు బెంచి ఇంతవరకు అతీగతి లేదన్నారు. ప్రజల పక్షాన ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రాజెక్టులకు డబ్బులు కేటాయించే విధంగా పోరాటాలకు సమాయాతం కావాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు దాసరి నాగభూషణ్ రావు శతజయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు మనోహర్ మాణిక్యం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు శేఖర్, లెనిన్ బాబు, భీమలింగప్ప, మహిళా నాయకులు లలితమ్మ, ఆహ్వాన సంఘం నాయకులు కె.జగన్నాథం, జిల్లా సహాయ కార్యదర్శి మునియప్ప, నగర సహాయ కార్యదర్శులు మహేష్, శేఖర్, అజయ్ బాబు, చంద్రశేఖర్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

'హమాలీల సమస్యలు పరిష్కరించాలి'

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రైల్వే గూడ్‌షెడ్‌లో పనిచేస్తున్న హమాలీల సమస్యలు పరిష్కరించాలని ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బతుకన్న డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే గూడ్ షెడ్ హమాలీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలని కోరారు.

బోధనేతర పనులు అప్పగించరాదు

- యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్
- ఘనంగా యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులకు బోధనేతర పనులను అప్పగించరాదని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూల్ నగరంలోని జిల్లా కార్యాలయంలో యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ పతాకాన్ని కె.సురేష్ కుమార్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను కూటమి ప్రభుత్వం కూడా అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాల విద్యను కాపాడుకోవాల్సిన బాధ్యత యుటిఎఫ్ కార్యకర్తలపై ఉందని, అందుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. 12వ పిఆర్‌సి కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పెండింగ్లో ఉన్న డిఎ, ఇతర ఆర్థిక బకాయిలను కూడా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు హేమంత్ కుమార్, జిల్లా కార్యదర్శులు తిమ్మన్న, దుర్గాప్రసాద్, జిల్లా పూర్వపు ప్రధాన కార్యదర్శి జయరాజు, నాయకులు కెంగార మోహన్, సురేష్, హనుమన్న తదితరులు పాల్గొన్నారు.



యుటిఎఫ్ జెండాను ఎగురవేస్తున్న రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్

ఆదర్శ ఉపాధ్యాయుడు ఈశ్వరయ్య

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

ఉపాధ్యాయుడు అంటే పాఠశాలలో విద్యార్థులకు కేవలం విద్యాబుద్ధులు నేర్పడం కాకుండా మరొకవైపున సామాజిక సేవ దృక్పథంతో ముందుకు సాగుతున్నారు. ఆదర్శ ఉపాధ్యాయుడిగా నిలుస్తున్నారు. ఆయన ఎవరో కాదు నందికొట్కూరు లోని కోట బాయ్స్ హై స్కూలులో గణితం సబ్జెక్టు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఈశ్వరయ్య. విద్యార్థులకు గణితమంటే ఓ రకమైన భయాందోళన ఉంటుంది. గణితంపై భయాందోళనలను తొలగించి సులభతరమైన పద్ధతిలో బోధనకు ఆయన శ్రీకారం చుట్టారు. గణిత ఉపాధ్యాయుడిగా ఆయనకు రాష్ట్రస్థాయిలోనే ప్రత్యేక గుర్తింపు కలిగి ఉన్నారు. గణితం సబ్జెక్టుకు సంబంధించి రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో రెమిడీయల్ మెటీరియల్ తయారీలో ఆయన ఎంతో కృషి చేశారు. రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించి గణిత సబ్జెక్టుపై విద్యార్థులకు బోధన ఎలా చేయాలనేది గైడ్‌గా కూడా వ్యవహరించారు. ఆయన ఏ పాఠశాలలో పని చేసినా అక్కడ విద్యార్థులకు గణితం సబ్జెక్టులో ఉత్తమ మార్కులు సాధించేందుకు కృషి చేస్తున్నారు. ఆయన విద్యార్థి బస్తిపాటి నాగరాజు కర్నూలు పార్లమెంటు సభ్యుడుగా ఎన్నికయి సేవలందిస్తున్నారు.

క్రమశిక్షణతో విద్యాబోధన: 1987లో రవీంద్ర విద్యానికేతన్ పాఠశాలలో గణితం సబ్జెక్టు ఉపాధ్యాయుడిగా ఈశ్వరయ్య ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనంతరం 1996 డిఎస్‌సిలో ఎస్‌జిటి అసిస్టెంట్ గా ఉపాధ్యాయ ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రాతకోట హైస్కూల్లో ప్రారంభించారు. అక్కడినుండి హుసేనాపురం హైస్కూల్లో బీకాంప్ బాయ్స్ హైస్కూల్ తదనంతరం బ్రాహ్మణ కొట్కూరు ప్రాథమికోన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. అక్కడే స్కూల్ అసిస్టెంట్ గా పదోన్నతి పొంది ఏ గోకులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితం సబ్జెక్టు స్కూల్ అసిస్టెంట్‌గా నియమితులయ్యారు. అక్కడినుండి కడుమూరు జిల్లా పరిషత్ హైస్కూల్ వడ్డమాను హైస్కూల్లో పనిచేసి ప్రస్తుతం నందికొట్కూరులోని కోట బాయ్స్‌హై స్కూలులో ఉపాధ్యాయుడుగా విధులను నిర్వహిస్తున్నారు. క్రమశిక్షణతో విద్యార్థులకు విద్యాబోధన అందిస్తున్నారు. గణితం సబ్జెక్టులో పిల్లల్లో ఉన్న భయాందోళన తొలగించి వారికి సబ్జెక్టు సునాయాసంగా అర్థమయ్యే రీతిలో బోధించేందుకు చర్యలు చేపట్టారు.

సామాజిక సేవలో కూడా : ఆడుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లడానికి రహదారి లేకపోవడంతో విద్యాశాఖ పంచాయతీ రాజ్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి జిల్లా పరిషత్ సిసి రోడ్డు నిర్మాణం చేయించారు. అదే గ్రామంలో శివగోపాల్ అనే వ్యక్తి ద్వారా రూ3.50 లక్షలతో విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరు అందించేం దుకు ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయించారు. ప్రతి ఏడాది విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్స్ అందజేసేవారు. తల్లిదండ్రులు లేని పిల్లలకు ఉచితంగా దుస్తులను అందజేస్తున్నారు. వడ్డెమాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రెండు కంప్యూటర్లు బాలికలకు కుట్టు శిక్షణ పొందేందుకుగాను రూ.88 వేలు గల కుట్టుమిషన్లను అందజేశారు. ఆయన పని చేసే ప్రతి పాఠశాలలో విద్యార్థులకు నేషనల్ మెరిట్ మీన్స్‌స్కాలర్షిప్‌కు ఎంపిక అయ్యేలా శిక్షణ ఇస్తున్నారు. కౌశల్ క్విజ్ పోటీలలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యేలా కృషి చేస్తున్నారు.

అనేక సంస్థలు అవార్డులతో సత్కారం: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు. లైన్స్ క్లబ్, కోల్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును స్వీకరించారు. ఒడిశా మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గోమాంగో రాష్ట్రస్థాయి ఉత్తమ పౌర పురస్కారాన్ని అందుకున్నారు. వీటితోపాటు పలు స్వచ్ఛంద సంస్థలు కూడా ఆయనకు ఉపాధ్యాయ వృత్తిలో రాసినందుకు సామాజిక సేవా కార్యక్రమాల్లో విశిష్ట కృషి చేస్తున్నందుకు అవార్డులతో సత్కరించాయి.

నైతిక విలువలు నేర్పడం ద్వారానే ఈ స్థాయికి : కర్నూలు ఎంపీ నాగరాజు

ఉపాధ్యాయుడు ఈశ్వరయ్య నైతిక విలువలు నేర్పడం ద్వారానే నేనీ స్థాయికి చేర్చుకున్నాను. అలాంటి ఉపాధ్యాయుడు నాకు దొరకడం అదృష్టం. గణిత సబ్జెక్టులో విశిష్ట ప్రతిభ కలిగిన ఉపాధ్యాయుడిగా ఆయనకు రాష్ట్రస్థాయిలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. నేటి తరం ఉపాధ్యాయులు ఆయన బోధన పద్ధతులను పాటించి విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు కృషి చేయాలి.



ఈశ్వరయ్యను అభినందిస్తున్న మాజీ జడ్‌పి ఛైర్మన్ వెంకటస్వామి, పుల్లయ్య(ఫైల్)



మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

- సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కార్మిక వర్గ పోరాటంతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ అన్నారు. కల్లూరు మండలం దూపాడు గ్రామంలో సిఐటియు కల్లూరు మండల రెండో మహాసభ ఆదివారం ఎ.ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. రాధాకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, సిపిఎం మండల కార్యదర్శి ఎ.కృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ... కార్మిక వర్గ పోరాటాలతోనే కార్మిక సమస్యలు పరిష్కారమవుతాయని వారన్నారు. కార్మిక సమస్యల కోసం సిఐటియు నిరంతరం పోరాడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా దేశవ్యాప్త సమ్మె నిర్వహించిందని తెలిపారు. కార్మికులకు రాజకీయ చైతన్యం అవసరమన్నారు. రాబోయే కాలంలో కార్మికుల సమస్యలపై సిఐటియు ముందుండి పోరాడుతుందన్నారు. 15 మందితో మండల కమిటీ ఏర్పాటు చేశారు. మండల కన్వీనర్‌గా కె.మధు, కోకన్వీనర్‌గా బి.చంద్రశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

13న కర్నూలులో రక్తదానం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు ప్రగతి సమితి ఆధ్వర్యంలో ఈనెల 13న తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.శ్రీహర్ష ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొండారెడ్డి బురుజు వద్ద బుధవారం ఉదయం 11 గంటలకు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఆసక్తి కలిగిన వారు సెల్ నెంబర్ 7993991234కు సంప్రదించాలని కోరారు.

పాఠశాల విద్యా వ్యవస్థను కాపాడుకోవాలి

- యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్ కుమార్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాల విద్యా వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైన ఉందని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్ అన్నారు. కలకత్తాలో జరుగుతున్న ఎస్‌టిఎఫ్ఐ రజతోత్సవ మహాసభలకు కర్నూలు జిల్లా నుండి యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్‌పాటి హాజరయ్యారు. రాష్ట్రం నుండి యుటిఎఫ్ చేపట్టిన కార్యక్రమాలను సురేష్ నివేదికను సమర్పించారు.



అందరి సహకారంతో అభివృద్ధి

- బదిలీ డిప్యూటీ కమిషనర్ విజయ రాజు



విజయరాజు

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీలక్ష్మినరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో అందరి సహకారంతో అభివృద్ధి పనులను చేపట్టామని డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. ఆదివారం ఆయన బదిలీపై వెళ్తూ డిప్యూటీ కమిషనర్‌గా వాణికి బాధ్యతలు అప్పజెప్పారు. అనంతరం ఆయన మాట్లాడారు. తన బదిలీపై వస్తున్న అపోహలను ఖండించారు. నాయకులు, కాంట్రాక్టర్లు, దేవాలయ అర్చకులు బదిలీ చేయించారనడంలో వాస్తవం లేదన్నారు. పుణ్యక్షేత్రంలో భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడానికి కృషి చేశామని, అధికారులు, అర్చకుల సహకారంతో దాతల దాతృత్వంతో పనులను వేగవంతం చేశామని తెలిపారు. ఒక భక్తునిగా ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో సేవలు అందించినట్లు చెప్పారు. బదిలీ అనేది మరో దేవస్థానంలో సేవలు అందించడానికి అవకాశం లభించిందని భావిస్తామన్నారు. ప్రతి ఉద్యోగికి బదిలీ సర్వసాధారణమని తెలిపారు. మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి, జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి, స్థానిక నాయకులు, అధికారులు, అర్చకులు, దేవాలయ సిబ్బంది సహకారంతోనే అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు.

అందరి సహకారంతో సేవలందిస్తాం : డిప్యూటీ కమిషనర్ వాణి



వాణి

శ్రీలక్ష్మినరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో అందరి సహకారంతో భక్తులకు సేవలందిస్తామని డిప్యూటీ కమిషనర్ వాణి తెలిపారు. ఆదివారం ఆమె బాధ్యతలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ... గతంలో ఇక్కడ పని చేసిన అనుభవం ఉందని, అలాగే స్వామి వారి భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా సౌకర్యాలు కల్పిస్తామని తెలిఆరు. రోజురోజుకూ ప్రసిద్ధి చెందుతున్న పుణ్యక్షేత్రం కావడంతో దేవాలయం పేరు, ప్రఖ్యాతలను చాటి చెప్పడానికి అందరి సహకారం అవసరమని చెప్పారు. పుణ్యక్షేత్రంలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

యూరియా కొరతను తీర్చాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చిప్పగిరి



పెళ్లి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విరుపాక్షి

ఆలూరు నియోజకవర్గంలో ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయని, రైతులకు యూరియా అందుబాటులో లేదని, యూరియా కొరత తీర్చాలని ఎమ్మెల్యే బి.విరుపాక్షి డిమాండ్ చేశారు. ఆదివారం చిప్పగిరిలో రుద్రయ్య స్వామి కుమారుడు పెళ్లి వేడుకకు ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో యూరియా కొరత అధికంగా ఉందని, కూటమి ప్రభుత్వం మొద్దు నిద్ర పోతుందని దుయ్యబట్టారు. వరి మడుగులకు తప్పనిసరిగా వేసుకునే యూరియా కొరత సృష్టించడం మానుకొని రైతులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు.

రుణాలను రెన్యువల్ చేసుకోవాలి

- ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ నరేష్ బాబు

ప్రజాశక్తి - గోనెగండ్ల



రైతుతో మాట్లాడుతున్న మేనేజర్

పంట రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో రెన్యువల్ చేసుకోవాలని గోనెగండ్ల స్టేట్ బ్యాంకు చీఫ్ మేనేజర్ నరేష్ బాబు, ఫీల్డ్ ఆఫీసర్ మధు మనోహర్ తెలిపారు. ఆదివారం గోనెగండ్లతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులను కలిసి రుణాలను సకాలంలో చెల్లించడం, రెన్యువల్ చేసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే దీర్ఘకాలికంగా బకాయి పడిన ఖాతాదారులు బకాయిలను వన్ టైం సెటిల్‌మెంట్ (ఒటిఎస్) పద్ధతి ద్వారా ఈనెల ఆఖరులోపు చెల్లించాలని కోరారు. అలాగే ఖాతాదారులు, రైతులు, ప్రజలు స్టేట్ బ్యాంకు ద్వారా రూ.436తో పిఎంజెజెబివై బీమా, రూ.20తో పిఎంకె ఎస్‌బిఐ 2 లక్షల బీమా పథకాలను వినియోగించుకోవాలన్నారు.

ఘనంగా ఖాసీం వలీ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - నందవరం



ఖాసీం వలీకి కేక్ తినిపిస్తున్న నాయకులు

టిడిపి మండల అధ్యక్షులు ఖాసీంవలీ పుట్టినరోజు వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు ఆయనను భారీ ఎత్తున కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి నాయకులు ఆదిశేషు, హనుమప్ప, బసవరాజు, వెంకటరాముడు, హనుమంతు ఆయన నివాసానికి చేరుకొని శాలువా, పూలమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

- యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు దావీదు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు దావీదు, జిల్లా కార్యదర్శులు గుమ్మల బాబు, కౌలన్న డిమాండ్ చేశారు. ఆదివారం యుటిఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎమ్మిగనూరు ప్రాంతీయ కార్యాలయం వద్ద భాస్కర్ బాబు, సోమప్ప సర్కిల్ వద్ద ఎన్.నాగమణి యుటిఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఎలను విడుదల చేయాలని, పిఆర్‌సిని ప్రకటించాలని కోరారు. నాయకులు మద్రి రాజు, రామాంజనేయులు, లక్ష్మన్న, పెద్దారెడ్డి, నీలి నాగరాజు, ప్రశాంత్ భూపాల్, ప్రసాద్, సుధాకర్, భాగ్యరాజు, శాంతన్న, నరసింహులు, శంకరయ్య, మంజునాథ్, కెల్లెల రాజు, అబ్దుల్ రహిమాన్, హనీఫ్, నాగరాజు, బాలరాజు, మానుకింద రాజు, హుస్సేని పాల్గొన్నారు. **గోనెగండ్ల**లోని గంజిహళ్లి రోడ్డు వద్ద యుటిఎఫ్ మండల గౌరవాధ్యక్షులు లింగన్న జెండాను ఆవిష్కరించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గుమ్మల బాబు మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడంతో పాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ నిరంతర కృషి చేస్తోందని, ఉపాధ్యాయులు కలిసి రావాలని కోరారు. జిల్లా మాజీ నాయకులు నరసింహ, మండల నాయకులు కెసి.నాగరాజు, రామన్, అక్బర్, జక్రియ, వీరేష్, గోవింద రాజులు పాల్గొన్నారు. **ఆదోని** యుటిఎఫ్ కార్యాలయం వద్ద యుటిఎఫ్ సీనియర్ నాయకులు కృష్ణమూర్తి, పాపయ్యలు జెండాను ఆవిష్కరించారు. జిల్లా సహాధ్యక్షులు జీవిత అధ్యక్షత వహించారు. జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు, మండల అర్బన్ అధ్యక్షులు సునీల్ రాజ్ కుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుధాకర్ మాట్లాడారు. జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు మల్లికార్జున, కౌతాళం మండల ప్రధాన కార్యదర్శి ఓంకార్, సీనియర్ నాయకులు మల్లయ్య, పెద్దయ్య, రుద్రముని, బసప్ప, సలావుద్దీన్, గిరిబాబు, కృష్ణుడు, నజీర్ అహ్మద్, నారాయణ, నాయ కులు ఆవుల బసప్ప, శివకుమార్ గౌడ్, హనుమంతు, భాస్కర్, సుధాకర్, రంగన్న, ఆజాద్, నాగేష్, మల్లికార్జున, ఆదెప్ప, మోదిన్ బాష, రంగన్న పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



గోనెగండ్లలో



ఆదోనిలో జెండాను ఆవిష్కరిస్తున్న కృష్ణమూర్తి

హామీలను అమలు చేయాలి : వైసిపి

ప్రజాశక్తి - మంత్రాలయం

ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వైసిపి మండల అధ్యక్షులు జి.భీమారెడ్డి ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని చెట్నిహళ్లి గ్రామంలో 'బాబు ష్యూరిటీ –మోసం గ్యారెంటీ' నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలతో పాటు మొత్తం 165 హామీలు ఇచ్చారని, హామీలను తూతూ మంత్రంగా అమలు చేస్తున్నారని విమర్శించారు. సర్పంచి అంజిని, ఉప సర్పంచి వీరనాగప్ప, ఎంపిటిసి రామాంజనేయులు, మాజీ సర్పంచి అల్లింగప్ప, నాయకులు గంగుల వెంకటేష్, పరషప్ప, పాండు, నాగేంద్ర, సోమన్న గౌడ్ పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన దేవరగట్టు

ప్రజాశక్తి - హోళగుంద



పూజలు చేస్తున్న అర్చకులు

శ్రావణ మాసం మూడో ఆదివారం సందర్భంగా మండలంలోని నెరనికి, నెరనికి తండా, కొత్తపేట కొండ గుహల్లో వెలిసిన మాల మల్లేశ్వర సన్నిధి భక్తులతో కిక్కిరిసింది. ఉదయం 6 గంటల నుంచి దర్శన నిమిత్తం భక్తులు క్యూ కట్టారు. స్వామివారికి అభిషేకం, బిల్వార్చన, బండారు అర్చన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పంప, మహేష్ స్వాములు పూజలు నిర్వహించారు. భక్తులకు దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆలయ కమిటీ కోసం నోటిఫికేషన్

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీలక్ష్మి నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ కమిటీ కోసం దేవదాయ శాఖ నోటిఫికేషన్ జారీ చేసినట్లు డిప్యూటీ కమిషనర్ వాణి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. వివరాలను త్వరలో వెల్లడిస్తామన్నారు.

తెలుగు తమ్ముళ్లలో చిగురించిన ఆశలు : మంత్రాలయం నియోజకవర్గంలో ఏకైక నామినేటెడ్ పోస్ట్ శ్రీలక్ష్మి నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయం బోర్డు ఛైర్మన్. ఈ పదవి కోసం కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చినప్పటి నుంచి టిడిపి నాయకులు ఎదురు చూస్తున్నారు. 14 నెలల తర్వాత నోటిఫికేషన్ విడుదల కావడంతో అందరి చూపు ఛైర్మన్ సీటుపై పడింది. పార్టీ గెలుపు కోసం కష్టపడిన నాయ కులు, కార్యకర్తలు ఆశలను పెంచుకున్నారు. కొందరు నాయకులు ఛైర్మన్ పదవికి పోటీపడుతుండగా, మరి కొందరు ట్రస్టు బోర్డు మెంబర్ కోసం పోటీ పడుతున్నారు. దీనికోసం ఇప్పటికే తమ నాయకుల దృష్టికి తీసుకెళ్లి విశ్వ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. నియోజకవర్గంలో టిడిపిలో జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి గ్రూపు, మంత్రాలయం ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి గ్రూపు ఉన్నాయి. రెండు గ్రూపుల్లో పదవి ఎవరిని వరిస్తుందోనని చర్చనీయాంశంగా మారింది. అధిష్టానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందో మరి కొన్ని రోజులు వేచి చూడాల్సిందే..?



వైభవంగా శ్రీరాఘవేంద్ర స్వామి పూర్వారాధన

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్ర స్వామి పూర్వారాధనను పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. రాఘవేంద్రుని సప్త రాత్రోత్సవాల్లో భాగంగా రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని పూజారులు నిర్మాల్యం చేసి తులసి అర్చన, పంచామృతాభిషేకం వంటి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం బృందావనాన్ని స్వర్ణ కవచాలతో, వివిధ రకాల పూలమాలలు వేసి అందంగా అలంకరించారు. ఉత్సవ మూర్తి ప్రహ్లాద రాయులను బృందావనం ముందు ఉంచి అలంకరించారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి ఆరాధ్య దైవమైన మూల రాములు, జయ రాములు, దిగ్విజయ రాములకు పండితుల వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ దూప, దీప నైవేద్యాలతో అర్చించి, మంగళ హారతులు ఇచ్చారు. మూల రాములు, జయ రాములు, దిగ్విజయ రాముల మూర్తులను చూపిస్తూ ప్రత్యేకతను వివరించారు.

శ్రీమఠం చేరిన శ్రీరంగం పట్టు వస్త్రాలు

తమిళనాడు రాష్ట్రం శ్రీరంగం నుంచి పట్టువస్త్రాలు మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠానికి ఊరేగింపుగా చేరుకున్నాయి. శ్రీరంగ దేవస్థానం నుంచి అధికారులు, పూజారులు శ్రీరంగం నుంచి పట్టువస్త్రాలు తీసుకొచ్చారు. శ్రీమఠం ఎఎఒ మాధవ శెట్టి, మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు పండితులు వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం వరకు స్వాగతం పలికారు. శ్రీమఠం ప్రాకారంలో పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులకు శేషవస్త్రాన్ని గౌరవంగా సమర్పించారు. అనంతరం ఊయల మండపంలో శ్రీరంగం అధికారులు, పూజారులు పీఠాధిపతులకు శ్రీరంగనాథుని శేషవస్త్రంతో సన్మానించారు. పీఠాధిపతులు కూడా శ్రీరంగనాథస్వామి ఆలయ అధికారులు, పూజారులను శేష వస్త్రంతో సన్మానించారు.

ప్రముఖులకు రాఘవేంద్ర అనుగ్రహ అవార్డుల ప్రదానం

వివిధ రంగాల్లో సేవలు అందించిన ప్రముఖులకు శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు రాఘవేంద్ర అనుగ్రహ ప్రశస్తి అవార్డులను ప్రదానం చేశారు. కోయంబత్తూర్‌కు చెందిన పారిశ్రామిక వేత్త విఠల్ రావు, ఉత్తర ప్రదేశ్‌లోని వారణాసికి చెందిన వేద పండితులు రాజారాం శుక్లాకు, కర్ణాటక హైకోర్టు రిటైర్డ్ జడ్జి శ్రీధర్ రావుకు యోగీంద్ర సభా మండపంలో జ్ఞాపికను అందజేసి ఆశీర్వదించారు. పీఠాధిపతుల పూర్వాశ్రమ తండ్రి, రాష్ట్రపతి ప్రతిభా అవార్డు గ్రహీత పండితకేసరి, మహామహోపాధ్యాయ బిరుదాంకితులు రాజా ఎస్.గిరియాచార్యులు, పూర్వా శ్రమ కుమారులు రాజా ఎస్.అప్రమేయచార్, శ్రీమఠం ఎఎఒ మాధవ శెట్టి, మేనేజర్లు ఎస్‌కె.శ్రీనివాసరావు, వెంకటేష్ జోష్, సురేష్ కోనాపూర్, ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతి ఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, ద్వారపాలకులు అనంత స్వామి, ప్రకాష్ రావు, పవన్ కుమార్, సహాయక పిఆర్ఒ హొన్నాళ్లి వ్యాసరాజాచార్, జయతీర్థ చార్ పాల్గొన్నారు.

సింహ వాహనంపై ఊరేగిన ప్రహ్లాద రాయులు

శ్రీరాఘవేంద్రస్వామి ఉత్సవ మూర్తి ప్రహ్లాద రాయులు సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వెండి రథంపై ఉత్సవ మూర్తి ప్రహ్లాద రాయులను సంహ వాహనంపై ఉంచి పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థులు మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ భక్త జనుల సందోహం మధ్య వైభవంగా రథోత్సవం నిర్వహించారు.



పీఠాధిపతులతో కలిసి వేదఘోషలో పాల్గొన్న అవార్డు గ్రహీతలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ

ఫ్యాక్షన్ గ్రామాల్లో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని కామన్‌దొడ్డి గ్రామంలో ఆదివారం ఎస్ఐ హనుమంతు రెడ్డి సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఉత్తర్వుల మేరకు గ్రామంలో రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తులు, నేరచరిత్ర గల వ్యక్తుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించామన్నారు. గ్రామంలోని బసవేశ్వర స్వామి గుడి దగ్గర గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. సైబర్ క్రైమ్ అవేర్‌నెస్‌లో భాగంగా ఒటిపి, ఎటిఎం కార్డు సీక్రెట్ పిన్, సివివి నెంబర్లు, అనుమానాస్పద లింకులు, లోన్ యాప్స్ గురించి, మహిళలు, చిన్న పిల్లలపై జరుగుతున్న నేరాలు (ఈవ్ టీజింగ్)పై అవగాహన కల్పించారు. గ్రామస్తులు, పిఎస్ఐ ఈశ్వరరావు, ఎఎస్ఐ తిరుపాల్ నాయక్, హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున, గిరీష్, వరప్రసాద్, రమేష్ బాబు, పిసిలు మునిస్వామి, సలాం వలీ పాల్గొన్నారు.

ఉద్యోగులకిచ్చిన హామీలను అమలు చేయాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి - ఆదోని

ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎస్‌టియు రాష్ట్ర పురపాలక కన్వీనర్ జి.వీరచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణ ప్రధాన కార్యదర్శి ఎస్.భీమరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరచంద్ర యాదవ్, ఎస్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు వి.రమేష్ నాయుడు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సకాలంలో డిఎలు ఇస్తామని, మెరుగైన వేతన సవరణ చేస్తామని హామీఇచ్చారని తెలిపారు. సిపిఎస్, జిపిఎస్ రద్దు విషయంలో సంవత్సరంలో స్పష్టత ఇస్తామన్న హామీ ఏమయిందని ప్రశ్నించారు. బోధనేతర పనులు మితిమీరి ఉపాధ్యాయులు ఒత్తిడికి గురవుతున్నారని, దీని ప్రభావం బోధనపై పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రంలో తెలుగు మాధ్యమం తప్పనిసరిగా కొనసాగించాలని, డీఎస్సీ 2003 టీచర్లకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి సర్వీసు నిబంధనల అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్‌టియు నాయకులు రవి, లోక్య నాయక్, ప్రహ్లాద, సుధాకర్, ప్రసాద్, ఉరుకుందప్ప, మారయ్య, శ్రీరాములు, వెంకటరామిరెడ్డి ఉన్నారు.

జనసేన ఇన్‌ఛార్జీ పుట్టినరోడు వేడుకలు

ప్రజాశక్తి - ఆదోని

జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మల్లప్ప పుట్టినరోజు వేడుకలను ఆదివారం అభిమానులు ఘనంగా నిర్వహించారు. పూలమాల, శాలువాతో సన్మానించి, భారీ కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా మల్లప్ప మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేర్చేందుకు కృషి చేస్తామన్నారు. నాయకులు రేణువర్మ, రాజశేఖర్, చంద్రశేఖర్, శ్రీనివాసులు, రాజశేఖర్, పులి రాజు, చిరుత రాజశేఖర్, జయరాం, సురేష్, రాము, తాహెర్ వలీ ఉన్నారు.



కేక్ కట్ చేస్తున్న మల్లప్ప

కోర్టులో భూమి సమస్య...

- కొనుగోలు చేస్తే ఇబ్బందులు తప్పవు
- మేధహాల్ గోవర్ధన్

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని ఉరుకుంద గ్రామంలో గల తమ భూమి సర్వే నెంబరు 222/ఎ ఎలాంటి క్రయవిక్రయాలూ, కట్టడాలూ చేపట్టరాదని, ఈ భూమి సమస్య కోర్టులో ఉందని మేధహాల్ గోవర్ధన్ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 4.84 సెంట్లు స్థలం బ్యాంకులో ఒడి ఖాతా మీద తనఖాలో ఉందన్నారు. తాము బ్యాంకుకు రూ.1,35,500 కట్టి ఉన్నామని చెప్పారు. వివిధ దఫాల్లో రూ.3 కోట్ల వరకు బ్యాంకుకు చెల్లించినట్లు తెలిపారు. ఇది తమ పెద్దలు సంపాదించిన ఆస్తి, మిగతా మొత్తం త్వరలో చెల్లించి భూమిని స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. ఈలోపు బ్యాంకు అధికారులు, స్థానిక నాయకులతో కుమ్మక్కై తమ భూమిని ఇతరులకు అమ్మారని తెలిసిందని, తాము బ్యాంకుకు డబ్బులు కట్టినప్పుడు వేరేవారికి ఎలా అమ్ముతారని ప్రశ్నించారు. అందుకే బ్యాంకుపై కోర్టులో కేసులు వేసినట్లు తెలిపారు. కేసులు కోర్టులో నడుస్తున్నాయని చెప్పారు. తమ భూమిని కొన్నవారు పంచాయతీ కార్యదర్శి అనుమతి లేకుండా ఈ భూమిలో షాపుల నిర్మాణం చేపట్టి, అమ్ముకోవడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ షాపులను ప్రజలు కొనుగోలు చేసి ఇబ్బందులు గురికావద్దని తెలిపారు. కొంటే చట్టరీత్యా జరిగే పరిణామాలకు మీరే బాధ్యులు అవుతారని చెప్పారు.



కోర్టు కాగితాలను చూపుతున్న గోవర్ధన్

రైతుల అభివృద్ధికి తోడ్పాటు

- శివశక్తి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ సిఇఒ నరసింహ రావు

ప్రజాశక్తి - ఆదోని

నూతన టెక్నాలజీ, నాణ్యమైన నూతన వ్యవసాయ ఉత్పత్తులను రైతులకు అందిస్తూ వారి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నామని శివశక్తి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ సిఇఒ కె.నరసింహ రావు తెలిపారు. శివశక్తి గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌లో ఒకటైన పుష్కల్ ఆగ్రోటెక్ లిమిటెడ్ రిటైల్ అవుట్ లెట్‌ను ఆదివారం ఆదోనిలోని ఎంఎం కాలనీ వాటర్ ట్యాంకు సమీపంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శివశక్తి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ గత 29 ఏళ్లుగా నాణ్యమైన సేంద్రీయ, జీవ ఎరువులు, ఆగ్రో కెమికల్స్ లాంటి అద్భుతమైన ఉత్పత్తులను రైతులకు అందిస్తూ, వారి పురోగతికి, ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్నట్లు తెలిపారు. పుష్కల్ ఆగ్రోటెక్ లిమిటెడ్ రిటైల్ అవుట్ లెట్‌లో నాణ్యమైన ఉత్పత్తులు, రైతులకు కావాల్సిన ఆగ్రో కెమికల్స్, సేంద్రీయ, జీవ ఎరువులు అందించడమే కాకుండా రైతులకు పంటల సమాచారం, చీడ పీడలను అరికట్టేందుకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. అవుట్ లెట్‌లో రైతుల పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివారణ చర్యలను తెలిపేందుకు ఫీల్డ్ ఆఫీసర్లను అందుబాటులో ఉంచుతామని పుష్కల్ ఆగ్రోటెక్ లిమిటెడ్ సీనియర్ జనరల్ మేనేజర్ శివ సాగర్ బాబు తెలిపారు. స్టోర్స్ రీజినల్ మేనేజర్ అయ్యస్వామి, ఆదోని స్టోర్ మేనేజర్ షబ్బీర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ జె.రాజేష్ కుమార్, రామానాయుడు, ఉద్యోగులు ఉన్నారు.



మాట్లాడుతున్న నరసింహ రావు



రేణుక ఎల్లమ్మ వారిని దర్శించుకుంటున్న విక్రమ్ గౌడ్

కోసిలో నటుడు, విలన్ విక్రమ్ గౌడ్ సందడి

ప్రజాశక్తి - కోసిగి

గ్రామంలో వెలసిన రేణుక ఎల్లమాంబ అమ్మవారిని ఆదివారం నటుడు, విలన్ విక్రమ్ గౌడ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శ్రావణమాసం సందర్భంగా కోసిగిలోని రేణుక ఎల్లమాంబ, ఉరుకుంద ఈరన్న స్వామి, మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని దర్శించుకుంటున్నట్లు తెలిపారు. దాదాపు 200 చిత్రాల్లో నటించానని, ప్రస్తుతం 'జి' తెలుగు , జెమిని, ఈటీవీలో సీరియల్స్‌లో నటిస్తున్నట్లు చెప్పారు. సినిమా షూటింగ్‌లు, సీరియల్స్‌తో తనకు గుర్తింపు వచ్చిందన్నారు. వరుణ్ తేజ్ నటించిన 'గద్దలకొండ గణేష్' చిత్రంతో సినిమాల్లో గుర్తింపు వచ్చిందని తెలిపారు. నటుడు రావడంతో చుట్టుపక్కల గ్రామస్తులు, యువకులు ఫొటోలు దిగేందుకు ఎగబడ్డారు. సీనియర్ ఎన్‌టిఆర్, బాలకృష్ణ అభిమానులు డీలర్ నర్సన్న, గాళెం వీరేష్, శ్రీనివాసులు, వీరారెడ్డి, ఉప్పలపాటి అర్జున్ ఉన్నారు.

'సహకార' ఉపాధ్యక్షులుగా హరికృష్ణ

ప్రజాశక్తి - చిప్పగిరి



సహకార సంఘం ఉద్యోగుల జిల్లా ఉపాధ్యక్షులుగా బెల్డోన సహకార సంఘం సిఇఒ జోలాపురం హరికృష్ణను ఎన్నుకున్నారు. ఆదివారం జిల్లా సహకార సంఘం కార్యాలయంలో తనను ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఆయన మాట్లాడుతూ... తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు జిల్లాలోని సహకార సంఘాల్లో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవితో మరింత బాధ్యత పెరిగిందన్నారు. బెల్డోన సహకార సంఘం అభివృద్ధికి, రైతులకు అన్ని రకాలుగా అందుబాటులో ఉండి విధులను నిర్వర్తిస్తానని అన్నారు.

13న ట్రాక్టర్, స్కూటర్ ర్యాలీ

- విజయవంతం చేయాలని ప్రజాసంఘాల పిలుపు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

అమెరికా, బ్రిటన్‌తో భారత్ ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ కర్నూలు నగరంలోని సుందరయ్య సర్కిల్ నుండి కలెక్టర్ ఆఫీస్ వరకు ఎస్‌కెఎం పిలుపు మేరకు జరిగే ట్రాక్టర్, స్కూటర్ ర్యాలీని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఆదివారం కార్మిక కర్షక భవన్లో రైతు, సిఐటియు, చేతివృత్తిదారుల సమావేశం నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ... అమెరికా, బ్రిటన్లతో భారత్ చేసుకునే ఒప్పందం దేశానికి పూర్తి నష్టదాయకమైందని, దీన్ని అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. 13న అమెరికా, బ్రిటన్ల ఒప్పందపు అగ్రిమెంట్ కాపీలను దహనం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే వ్యవసాయ రంగం పారిశ్రామిక రంగం సంక్షోభంలో ఉన్నాయని ఈ ఒప్పందాల వల్ల మరింత దిగజారిపోయేటువంటి పరిస్థితి కలుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి దేశవ్యాప్త కార్యక్రమంలో భాగంగా కర్నూలు నగరంలో జరిగేటువంటి కార్యక్రమంలో రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, చేతివృత్తి దారులు, యువజనులు, విద్యార్థులు అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు. సిఐటియు నాయకులు రాముడు, రాజశేఖర్, సాయి బాబా, చేతి వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురుశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామకృష్ణ

రజక బాలికపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

- ఎపి రజక వృత్తిదారుల సంఘం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

బాపట్ల జిల్లా కారంచేడు మండలంలో రజక సామాజిక వర్గానికి చెందిన మూగ, చెవిటి బాలిక దేవికపై దాడి చేసిన రిటైర్డ్ టీచర్ యార్లగడ్డ శ్రీకృష్ణ, ఆయన భార్య సుజాతలను అరెస్టు చేయాలని, లేకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని ఏపీ రజక వృత్తిదారుల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్, అధ్యక్షుడు ముక్కన్న, నాయకులు శేషాద్రి, శ్రీనివాసులు, రాముడు, పర్ల సుంకన్న, డాక్టర్ శేఖర్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కారంచేడు గ్రామంలో బడుగు బలహీన వర్గాలపై సామాజిక వర్గాన్ని తిట్టగలిగి మాట్లాడగలిగిన ధైర్యం లేదని, పోలీసు వారు బలహీనవర్గాలకు చెందిన రజకులకు రక్షణ కల్పించాలని రజకులను కులం పేరుతో తిట్టడం జీవో నెంబర్ 38 ప్రకారం నేరమని, ఆ జీఓ ప్రకారం అతనిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ నేతలు కేసు రిజిస్టర్ కాకుండా అడ్డుపడడం భావ్యం కాదని, రజకులపై దాడి చేసి కొట్టింది నిజమని అందుకు సాక్ష్యం దేవిగా దేహంపై గాయాలని చెబుతూ కేసు రిజిస్టర్ చేసి నిందితుల అరెస్టు చేయాలన్నారు. రజకులకు సామాజిక రక్షణ కల్పించడానికి చర్యలు చేపట్టాలని కోరారు.



మాట్లాడుతున్న గురుశేఖర్

12 నంది అవార్డుల రచయిత పల్లేటి

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

ఆధునిక పద్య నాటకంలో వ్యక్తిగతంగా 12 నంది అవార్డులతో పాటు ఆయన రచించిన నాటకాలకు 86 నంది అవార్డులు వచ్చాయని, పల్లేటి కులశేఖర్ తెలుగు పద్య నాటక రంగానికి గర్వకారణమని వక్తలు కొనియాడారు. ఆదివారం స్థానిక టిజివి కళాక్షేత్రంలో పద్య నాటక రచయిత పల్లేటి కులశేఖర్ ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. సభకు అధ్యక్షులు ఓబులయ్య అధ్యక్షత వహించి మాట్లాడారు. ఒక టిజివి కళాక్షేత్రానికే ఆయన రచించిన నాటకాల్లో 35 నంది అవార్డులు వచ్చాయని, ఆస్థాన కవిగా పేరొందారని తెలిపారు. ఆయన మరణం నాటక రంగానికి తీరని లోటని చెప్పారు. కార్యదర్శి సి.యాగంటీశ్వరప్ప, కళాకారులు జివి.శ్రీనివాస్ రెడ్డి, పి.రాజారత్నం, గాండ్ల లక్ష్మన్న, కదిరి రమేష్, కెవి.రమణ, పిపి.గురుమూర్తి, లక్ష్మీకాంతరావు, క్రిస్టఫర్, మద్దయ్య, సి.నవీన్ కుమార్ చౌదరి, శామ్యూల్, హార్మోనిస్టు బలరాముడు పాల్గొన్నారు. అనంతరం అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని వివరించే 'రక్తసంబంధం' సినిమాను ప్రదర్శించారు.



నివాళులర్పిస్తున్న దృశ్యం

చోరీలకు పాల్పడిన నిందితుడు అరెస్టు

- 16 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

- కర్నూలు డీఎస్పీ జె.బాబు ప్రసాద్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

బస్టాండ్‌లో బ్యాగుల చోరీకి పాల్పడే నిందితుని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 16 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నామని కర్నూలు డీఎస్పీ జె.బాబు ప్రసాద్ తెలిపారు. ఆదివారం కర్నూలు డీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కర్నూలు నాలుగో పట్టణ పరిధిలోని ఆర్‌టిసి బస్టాండ్‌లో జరిగిన బ్యాగ్ దొంగతనాలపై ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టామన్నారు. కర్నూలు నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ సిఐ విక్రమ్ సింహ ఆధ్వర్యంలో, ఎస్ఐ మోహన్ కిశోర్, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ ఎస్ఎ.ఖాద్రీ, ఎస్.షాకీర్, కానిస్టేబుళ్లు ఎల్లా శివుడు, సుబ్బరాయుడు, లక్ష్మణ్ నాయక్‌లు ప్రత్యేక బృందంగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారని తెలిపారు. నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం సిద్ధాపురం గ్రామానికి చెందిన గున్న అంజి బ్యాగులు దొంగిలిచ్చినట్లు దర్యాప్తులో గుర్తించినట్లు చెప్పారు. ఆత్మకూరు, సిద్ధాపురం, నంద్యాల, తదితర ప్రాంతాల్లో మాటు వేసినట్లు తెలిపారు. నంద్యాల టౌన్ నూనెపల్లిలో అరెస్ట్ చేసినట్లు చెప్పారు. విచారించగా దొంగతనానికి పాల్పడినట్లు నిందితుడు అంగీకరించాడని తెలిపారు. అతని వద్ద నుంచి సుమారు 16 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సంబంధిత యజమానులకు బంగారు ఆభరణాలను కోర్టు ద్వారా అప్పగించినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న డీఎస్పీ బాబు ప్రసాద్

హామీలను అమలు చేయాలి

- కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుమన్, మధు బాబు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సుమన్, ఈ.మధుబాబు డిమాండ్ చేశారు. ఆదివారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ పొదుపు భవన్‌లో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా సమావేశం నిర్వహించారు. జిల్లా నాయకులు ఎం.రాముడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రస్తుతం అప్కాస్‌లో ఉన్న లోపాలను సరిదిద్దాలన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను సిఎఫ్‌ఎంఎస్‌లో ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తూ సంక్షేమ పథకాలను రద్దు చేశారన్నారు. హెచ్‌ఆర్ పాలసీ అమలు చేసేందుకు కృషి చేయాలని కోరారు. అంగన్వాడీలు, గ్రామ రెవెన్యూ సహాయకులు, ఆశావర్కరక్లు ప్రభుత్వం సర్వీసు రూల్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఎపి జెఎసి అమరావతి జిల్లా ఛైర్మన్ కెవై.కృష్ణ మాట్లాడుతూ... కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తామని పేర్కొన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రామ్ భద్ర, సెక్రటరీ చారి, ఎం.నాగరాజు, ఎం.అమిదాబి, శ్రీధర్, సంధ్య, సరస్వతి, సోమన్న, సరోజ, సావిత్రి, యశోద పాల్గొన్నారు.

మైపర్‌లో ముగిసిన జాబ్ మేళా




ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

నగరంలోని ఎ.క్యాంపులో ఉన్న మైపర్ ఫార్మసీ కళాశాలలో ఆదివారం అరబిందో ఫార్మా కంపెనీ వారితో జాబ్ మేళా నిర్వహించారు. ఎం.ఫార్మసీ, బిఫార్మసీ, బీఎస్సీ, డిప్లొమా, పూర్తి చేసిన విద్యార్థులు హాజరయ్యారు. ఈ జాబ్ మేళాలో 100 విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ స్థానాలకు ఎంపిక నిర్వహించారు. ఎంపిక తర్వాత వారికి ఆఫర్ లెటర్ అందజేశారు. మైపర్ ఫార్మసీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ... ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవడం ఎంతో ఆనందాన్నిచ్చిందని తెలిపారు. మైపర్ విద్యార్థులకు ప్రతేడాది వంద శాతం ప్లేస్‌మెంట్ ఇస్తున్నామని, ఈ ప్లేస్‌మెంట్స్ ద్వారా తమ విద్యార్థులే కాకుండా నగరంలోని అన్ని కళాశాలల విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కోదాడ మహాలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కాసర్ల సురేష్, అకాడమిక్ డీన్ డాక్టర్ రాజ్ కుమార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కాకర్ల ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

12న 'థాంక్యూ సిఎం సార్'

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

నాయీ బ్రాహ్మణులకు, సెలూన్ షాపులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేసినందుకు ఈనెల 12న 'థాంక్యూ సిఎం సార్' నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా నాయీ బ్రాహ్మణుల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పాలకవీటి విజయ్ కుమార్ తెలిపారు. ఆదివారం నగరంలోని బిర్లా కాంపౌండ్‌లోని తన కార్యాలయంలో నాయీ బ్రాహ్మణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కర్నూలు, పాణ్యం, కోడుమూరు, డోన్, నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, ఎమ్మిగనూర్, ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఆత్మకూరు, మంత్రాలయం, బనగానపల్లె నియోజవర్గాల నాయీ బ్రాహ్మణ అధ్యక్షులు, సంఘం పెద్దలు ఐక్యమతంగా మేళతాళాలతో ఘనంగా సిఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న అసోసియేషన్ నాయకులు